క్లుప్తంగా

ఆశ్రమం నిర్వహణకు ఆర్థిక సాయం


విరాళం అందిస్తున్న శ్రీనివాసరావు దంపతులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీబాపూజీ వృద్ధాశ్రమ నిర్వహణ కోసం జి.అగ్రహారానికి చెందిన చందక శ్రీనివాసరావు, గీత దంపతులు రూ.5 వేలు ఆర్థిక సహకారాన్ని అందించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు కోట్ల లక్ష్మణరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. దాత చందక శ్రీనివాసరావు తల్లిదండ్రులు చందక రమణయ్య, అప్పలనర్సమ్మల ఐదో వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధాశ్రమానికి ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు.

ఆడదూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


రైతుకు టీఎంఆర్ దాణాను అందజేస్తున్న కృష్ణ

గంట్యాడ: ఆడదూడల పథకాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రెడ్డి కృష్ణ అన్నారు. మండలంలోని నరవ గ్రామంలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. అదేవిధంగా టీఎంఆర్ దాణాను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో వచ్చే వ్యాధులకు సకాలంలో చికిత్స చేయించాలని సూచించారు. లైవ్‌స్టాక్ డాక్టర్ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, తదితరులు


గంట్యాడ: మాలలంతా ఐక్యంగా ఉండాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి లోగిశ రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని కరకవలస గ్రామంలో శుక్రవారం మాలమహానాడు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దళితుడి ఇంట్లో అంబేడ్కర్ చిత్రపటంతో కూడిన క్యాలెండర్ ఉంచాలని అన్నారు. మాలల రిజర్వేషన్లు రద్దు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పావాడ అంబేడ్కర్, మురళి, జి.శేఖర్, వెలగాడ గరువులు, బి.మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న కాటమయ్య

జామి: పాడిరైతుల సంక్షేమమే లక్ష్యమని విశాఖ డెయిరీ డైరెక్టర్ కాలమయ్య అన్నారు. మండల కేంద్రంలోని విశాఖ డెయిరీ కార్యాలయంలో చైర్మన్ ఆడారి తులసీరావు సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలమయ్య మాట్లాడుతూ.. పాడిరైతుల సంక్షేమం కోసం విశాఖ డెయిరీని ఏర్పాటు చేయడం జరిగిందని, చైర్మన్ తులసీరావు ఆశయ సాధనకు సిబ్బంది కృషిచేయాలని కోరారు. అనంతరం డెయిరీ ఆర్ఎం సి.విజయ సుబ్రహ్మణ్యం, బీఎం సునీల్ పాడి రైతులకు అందిస్తున్న రుణాలు, రాయితీలు, సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో వేతన కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి


గజపతినగరం: పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ కొండమ్మ, పంచాయతీ కార్యదర్శి

దత్తిరాజేరు: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు దృష్టిసారించాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, డ్రైనేజీలు, తాగునీటి వనరుల్లో బ్లీచింగ్ వేయించాలని సూచించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించే బాధ్యత గ్రీన్‌అంబాసిడర్లపై ఉందన్నారు.

పారిశుద్ధ్య పనులు

గజపతినగరం: మండల కేంద్రమైన గజపతినగరంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పారిశుద్ధ్య సిబ్బంది బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ, పంచాయతీ సెక్రటరీ రమణ పనులను పర్యవేక్షించారు.

పల్లెకు పండగొచ్చింది


హరిదాసు వేషధారణలో బాలుడు


వీధుల్లో డూడూ బసవన్నల సందడి


ఇంట్లో ఉన్న సామగ్రిని శుభ్రం చేస్తున్న మహిళలు

వేపాడ: తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి వచ్చేసింది. పండగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకునేందుకు దూర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా సొంతూర్లకు చేరుకుంటున్నారు. దీంతో పల్లెకు పండగ కళొచ్చింది. ఇప్పటికే గ్రామాలో డూడూ బసవన్నలు, జంగమదేవర్లు, బుడబుక్కలవాళ్ల సందడి నెలకొంది. శనివారం వేకువ జామున భోగి మంటలు వేసేందుకు యువకులు కలపను సిద్ధం చేశారు.

సంక్రాంతి సందడి


రంగవల్లులను పరిశీలిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, ఎంపీడీఓ వేధవతి

బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. వేడుకల్లో ఎంపీపీ చల్ల చలంనాయుడు, ఎంపీడీఓ ఎ.వేధవతి, ఏపీఓ బి.కృష్ణవేణి, ఈఓపీఆర్డీ సుగుణకరరావు, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ పోటీలు

శృంగవరపుకోట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలోని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో క్రీడా పోటీలు నిర్వహించారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులను సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి వారి మధ్య సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించినట్లు కోచ్ పి.శ్రీరాములు చెప్పారు. గెలుపొందిన వారికి భోగీ రోజు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.


శృంగవరపుకోట: షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రబీ పంటల సాగుపై దృష్టిపెట్టాలి


మట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి వైస్ చైర్మన్ చిన్నంనాయుడు

బొండపల్లి: రబీ పంటల సాగుకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని వ్యవసాయ సలహా మండలి వైస్ చైర్మన్ బొద్దల చిన్నంనాయుడు అన్నారు. మండలంలోని గరుడుబిల్లి గ్రామంలోని ఆర్బీకేలో శుక్రవారం మండలం వ్యవసాయ సలహా మండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నంనాయుడు మట్లాడుతూ ఈనెల 15 లోగా పీఎం కిసాన్ యోజన కోసం అర్హులైన ప్రతీ రైతుతో ఈకేవైసీని చేయించాలని సూచించారు. అలాగే మండలంలోని మామిడి రైతులకు సరైన సలహాలు, సూచనలు అందించి, దిగుబడి పెరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఈఓఏ సంతోష్ కుమార్, ఉద్యానవనశాఖ అధికారి రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా చేస్తాం

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి వంగపల్లిపేట గ్రామంలో శుక్రవారం ఇంటింటి కుళాయిల ద్వారా జరుగుతున్న తాగునీటి సరఫరాను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోవిందరావు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో తిరిగి తాగునీరు సరఫరా జరుతుతున్న తీరును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామస్తులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన మజ్జి శ్రీనివాసరావులకు సమస్య వివరించడంతో వారి ఆదేశాల మేరకు గ్రామంలో తాగునీటి సరఫరా పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. అయితే ఇప్పటికే గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉన్నాయని, అయినప్పటికీ ఒక్కోసారి కొన్ని నివాసాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు వివరించినట్లు చెప్పారు. అందుకనే గ్రామంలో అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణానికి అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వారితో పాటు ఎంపీటీసీ గిరడ రాందాసు, పతివాడ రాజారావు, మీసాల సీతారాం తదితరులు ఉన్నారు.


వంగపల్లిపేటలో తాగునీటి సరఫరా పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు

దత్తిరాజేరు: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని పెదమానాపురం ఎస్సై బి.భాగ్యం హెచ్చరించార. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులందరితో కలిసి పండగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. మద్యం తాగి రోడ్లపై తిరిగినా, బైక్‌లు వేగంగా నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు. పండగ సమయంలో చట్ట విరుద్ధమైన పనులు జరగకుండా నిత్యం మెబైల్ వాహనం ద్వారా సిబ్బంది గస్తీ నిర్వహిస్తారన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1,11,111 వితరణ


దాతలను సన్మానిస్తున్న ఆయల కమిటీ సభ్యులు, గ్రామస్తులు

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి విశాఖపట్నంకు చెందిన న్యాయవాది నన్నపనేని రాజా రూ.1,11,111లు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలానికి చెందిన గొర్లె శ్రీనివాసరావు ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందజేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చాగంటి గౌతం శాస్త్రి, గుమ్మడి రవికుమార్, సభ్యులు అల్లు గౌరినాయుడు, వెంకటరమణ, నేతేటి మధుకుమార్‌శర్మ పాల్గొన్నారు.

అష్టలక్ష్మిగా గోదాదేవి


అష్టలక్ష్మిగా పూజలందుకుంటున్న గోదాదేవి

శృంగవరపుకోట: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం అష్టలక్ష్మీ పూజ ఘనంగా నిర్వహించారు. పవిత్ర ధనుర్మాసంలో ఆఖరి శుక్రవారం సందర్భంగా గోదాదేవిని అష్టలక్ష్మిగా అలంకరించి భక్తులందరి చేత సామూహిక పూజలు చేయించారు. అనంతరం నవదీప అర్చన ఘనంగా చేశారు.

చోరీలపై అప్రమత్తం


మాట్లాడుతున్న సీఐ బాలసూర్యారావు

కొత్తవలస: పండగ వేల చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తవలస సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. శుక్రవారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించి చోరీలపై ప్రజలను అప్రమత్తం చేశారు. సంక్రాంతి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు బంగారం, నగదు, విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. చిన్నపిల్లల ఒంటిపై విలువైన ఆభరణాలు వేసి ఒంటరిగా బయటకు పంపించొద్దన్నారు. ఇల్లు విడిచిపెట్టి దూర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కొత్తవారికి ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు వారి ఆధార్‌కార్డు, ఇతర వివరాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో పాసింజర్ వాహనాల్లో ప్రయాణించేవారు మిత్రులకు, కుటుంబ సభ్యులకు ముందుగా సమాచారం అందించి వెళ్లడం మంచిదన్నారు. మోటార్ సైకిళ్లకు హేండల్ లాక్ వేసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సీఐ నంబర్ 91211 09421, పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ


మహిళా ఉద్యోగికి దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: మండల ప్రజలంతా సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోవాలని ఎంపీపీ పీరుబండి హైమావతి ఆకాంక్షించారు. సంక్రాంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


వెలుగు సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు.

మండలంలోని ఇందిర క్రాంతి పథం(వెలుగు) సిబ్బందితో బుధవారం ఆయన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో పాటు అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతేకాకుండా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే వెలుగు ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి తదితర రుణాలు చక్కగా అందిస్తున్నారని చెప్పారు. అయితే ప్రభుత్వం నుంచి వస్తున్న రుణాలు మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బాగుపడే విధంగా వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం ఎంవీ రాజశేఖర్, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామానికి చెందిన లండ నారాయణమ్మ జగనన్న చేయూత పథకం కింద కొనుగోలు చేసిన పాడిఆవు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో అధికారులు బీమా పరిహారాన్ని అందజేశారు. ఈ నెల 5న ఆవు మృతి చెందడంతో పరిహారం కోసం బాధితురాలు సంబంధిత అధికారులను సంప్రదించాడు. బీమా వర్తించడంతో గొట్లాంలోని యూనియన్ బ్యాంకు మేనేజర్ పి.మల్లేశ్వరరావు శుక్రవారం రూ.74వేలును బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. బ్రాంచ్ పరిధిలో ఈ నెల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు డ్వాక్రా సంఘాలకు రెండున్నర కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, బ్యాంకు అధికారులు విజయలక్ష్మి, శ్రీనివాస్, నీలిమ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు బీమా పరిహారం అందజేస్తున్న బ్యాంకు మేనేజరు మల్లేశ్వరరావు

వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

లక్కవరపుకోట: వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి వెలకట్టలేనిదని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీహెచ్ మాధవరావు అధ్యక్షతన శుక్రవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతును అన్ని విధాలా ప్రోత్సహించేందుకు వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రైతులు రుణపడి ఉంటారన్నారు. సలహా సంఘం చైర్మన్ మాధవరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందుతోందన్నారు. మండల వ్యవసాయాధికారి స్వాతికుమారి మాట్లాడుతూ ప్రస్తుతం సాగునీరు అందుబాటులో ఉన్నందున రైతులు రబీ వరి సాగుకు సిద్ధం కావాలని సూచించారు. రైతుల అవసరాలకు తగ్గట్లు ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రూపేష్, రైతులు గేదెల నర్సింనాయుడు, పశువైద్యాధికారి కె.గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై వీరజనార్దన్

కొత్తవలస: యువకులు స్నేహపూర్వకంగా మెలిగేందుకు క్రీడలు దోహద పడతాయని, తద్వారా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ఎస్ఐ వీరజనార్దన్ అన్నారు. మండలం కేంద్రంలోని విశాఖపట్నం రోడ్డులో ఉన్న వసంత్ విహార్ కాలనీ వద్ద వసంత్ విహార్ యూత్, ఫర్ ది పీపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు మండలం నలుమూలల నుంచి 20 టీమ్‌లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలు నాకౌట్ పద్ధతిలో సాగాయి. శనివారం ఫైనల్ మ్యాచ్, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. వసంత్ విహార్ చైర్మన్ వల్లూరి జయప్రకాష్, ఫర్ ది పీపుల్ ట్రస్ట్ చైర్మన్ వి.హరకుమార్, కర్రి సూర్య నూకరాజు, రావులపూడి గోవిందు ఆర్థిక సాయంతో మొదటి మూడు బహుమతులు రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు నగదు, క్రీడాకారులకు టీషర్టులు, బాల్స్, నెట్‌లను సమకూర్చారు. కార్యక్రమంలో వసంత్ విహార్ యూత్ సభ్యులతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

బొద్దాంలో ఇంటింటి కుళాయిలు ప్రారంభం


వేపాడ: బొద్దాంలో ఇంటింటి కుళాయిలు ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మండలంలో బొద్దాం గ్రామంలో ఇంటింటి కుళాయిలను ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఎంపీపీ నిధులు రూ.3 లక్షలతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో మూడు వీధుల్లో 50 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, వైస్ సర్పంచ్ స్వర్ణపూడి వెంకటరమణ, ఎంపీడీఓ పట్నాయక్, గ్రామ పెద్దలు ఎర్రా సన్యాసిరావు, దుల్ల కుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.